తారతమ్యం

"మన గౌరవానికి తగినట్లు చదివింపులు పెట్టకుంటే నలుగుర్లో ఏమి గౌరవముంటుందీ? అందులోనూ మా తమ్ముడిది పెద్ద ఆఫీసర్ల సంబంధం-అదే సి.టి.వో. వాళ్ళది. పైగా యింటికి పెద్దల్లుడయితిరి. ఆ తర్వాత మీ యిష్టం. ఒక వారం రోజులు ముందు గానే పెళ్ళికి రమ్మని మా నాన్న రాసాడు", చేతుల్లోని శుభలేఖా, తండ్రి ఉత్తరమూ మాటిమాటికీ చూసుకుంటూ గౌరి, భర్త రామకృష్ణతో అంది.

తమ్ముడి పెళ్ళి విషయం మాత్రమే నొక్కి చెబుతూ, ఒకే ముహూర్తంలో జరుగుతున్న చెల్లెలి పెళ్ళి విషయం పట్టనట్లు మాట్లాడుతున్న భార్యను రామకృష్ణ అర్థం చేసుకోలేకపోయాడు. అదే అడిగాడు.

"మరి సుమతి పెళ్ళి కూడా ఉందిగా"?

"ఆఁ దాందేముంది? సుమతికి ఏమీ పెట్టకపోయినా, ఎవరు మాత్రం అనుకొని చస్తారు? ఆస్తిపాస్తుల్లేని పల్లెటూరు సంబంధం. ఆ పెండ్లికొడుకు చదువా ఒఠ్ఠి బి.కాం. ఉద్యోగమా, బాంకి గుమాస్తా"- గౌరి దీర్ఘంతీస్తూ సమాధానమిచ్చింది. రామకృష్ణను కొరడాతో బాదినట్లయింది.

సుమతికి కాబోతున్న భర్తకంటే తన యోగ్యతలు ఏ మెక్కువని? తనకూ జమీలు లేవు. తాను పుట్టిందీ, తన వాళ్ళుండేది పల్లెటూరే. తన చదువా - ఆస్తిని హరించినా ఎం.కాం; తన ఉద్యోగమా యాదృచ్ఛికంగా దొరికిన జూనియర్ కాలేజీ లెక్చరరు ఉద్యోగం. బాంకి గుమస్తాకంటే తానెన్ని అంతస్తులు పైనున్నానని? గౌరికి యీ విషయం తెలియదా? తెలిసినా కొంత గొప్పయినా మిగుల్చుకోవాలనే తాపత్రయమేమో! పుట్టింటి గొప్పలేమో! - ఆత్మవంచన కాకపోతే.

అనుమానంగా అడిగాడు :

"మరి మీ నాన్న యీ సంబంధానికి ఎందుకు ఒప్పుకున్నట్లు?"

"ఆయిన సంబంధం వదిలించుకోలేక, మా మేనత్త జలగలాగా పట్టింది" గౌరి మేనత్తమీద తప్పిదం వేసింది.

రామకృష్ణ అసహనంగా అన్నాడు :

"ఆ మాటెందు కంటావు? 'కారు చౌకగా అల్లుడు దొరుకుతూ వుంటే వదులుకుంటారా?' అనరాదా?"

"అదేంకాదు. మా నాన్న మీకు మాత్రం వేలు వేలు పోసాడా? అయినా ఆడపిల్లలకే పెడుతూ కూర్చుంటే కన్న కొడుకులు చిప్పలు పట్టుకొని వీధుల్లో పడాల్సిందే. కొడుకులు కొడుకులే. కూతుర్లు కూతుర్లే."

'అయితే ఆ పట్టుకునే చిప్పలేవో ఆడవాళ్లే పట్టుకొని ఊరేగాలంటావు' అని రామకృష్ణ నోటిదాకా వచ్చింది. ఆ మాట అనలేకపోయాడు.

ఆ మాట అన్నాడంటే యింకామామగారి నుంచి డబ్బులు పిండడం కోసం తానేడుస్తున్నట్లు గౌరి రాద్ధాంతం చేస్తుంది. ఆమె ఆలోచనలూ, వాదనలూ రెండేళ్ళనుంచీ వింటున్నాడు, తానూ. తన ఆలోచనలూ, అభిప్రాయాలూ ఆమె బుర్రకు యెక్కవు. యెక్కకపోవడం అటుంచి పెడార్థాలు లాగుతుంది.

రామకృష్ణ మాట మార్చాడు:

"పెళ్ళికి వెళ్ళక తప్పదు సరే. చదివింపులు పెట్టకపోతే మునిగిపోయేదేముందీ?"

గౌరి చిరాకుగా అడ్డు తగులుతూ అంది:

"మీ కేమీ మునిగిపోతుంది - ఏ మర్యాదలూ అక్కరలేనివాళ్ళకు. గతి లేక పెట్టలేందంటారు. మన వైభోగం అందరికీ తెలుస్తుంది. పెళ్లింట్లో తలెత్తుకొని తిరగొద్దూ. దాని కంటే పెండ్లికి పోకపోతేనే బాగుంటుంది. సాకు దొరకకపోదు."

గౌరి నిష్ఠూరానికి రామకృష్ణ బాధ పడ్డాడు.

ఇంకెన్నేళ్ళు కాపురం చేస్తే తననూ, తప్పని పరిస్థితులనూ అర్థం చేసుకుంటుందో?

రాజీ ధోరణిలో అన్నాడు :

"పోనీలే నీ యిష్టం ఎందుకు కాదనడం. డబ్బెంత కావలసి వుంటుంది?"

"ఒక ఆరేడు నూర్లయినా లేకుంటే బాగుంటుందా?"

"అంత డబ్బు చేతిలో ఎక్కడుందీ?"

"చేతుల్లో ఎప్పుడు మాత్రం పట్టుమని పది రూపాయలున్నాయి. దానికనీ, దీనికనీ పనికిమాలినవానికైతే అప్పులు దొరుకుతాయి."

తన విషయం తెలిసి అవమానిస్తోందో, అమాయికంగా తెలియక మాటలతో హింసిస్తూందో రామకృష్ణకు అర్థం కాలేదు. యీ విధంగా మాట్లాడడం అలవాటో, నైజమో?

ఒక నిశ్చయానికి వచ్చి అనునయించాడు :

"ఏదో తిప్పలు పడదాంలే".

రెండు రోజులు రామకృష్ణ అప్పుకోసం నానా అవస్తలూ పడ్డాడు. అక్కడా యిక్కడా అయిదు వందలు పోగయింది. భార్యకు యీ విషయం తెలిపేడు.

"ఇప్పటికి దొరికింది యిది. తమ్మునికీ, చెల్లెలుకూ, నీకు ఏమేమి పెట్టుకుంటావో

పెట్టుకో."

"ఇంకా నయం ! మిమ్మల్ని కలుపుకోలేదు. నాకు పెట్టేవేవో మా వాళ్లు పెడతారు. మా తమ్మునికి ఒక ఉంగరం పెడదాం. యీవాళే చేయిస్తే మర్నాడైనా పోవచ్చు."

"మరి సుమతికి?"

"మాటి మాటికి సుమతి సుమతి అంటారు. మీకే యేవో అభిమానాలూ, ప్రేమలూ వున్నట్లు - నాకు లేనట్లు. సుమతికి పెద్ద ఖరీదేమీలేకుండా ఒక చీరె తెండి - నూరు రూపాయల లోపు. ఏమి పెట్టినా, పెట్టకపోయినా అనుకునే వాళ్లెవరు? అన్నట్లు మీ నడిమివేలు సైజు ఉంగరం చేయించండి, తమ్మునికి".

గౌరి వింత మనస్తత్వానికీ, ప్రవర్తనకూ రామకృష్ణ బాధపడ్డాడు. అభిమానాలూ, ప్రేమలూ యిద్దరిమీదా ఒకటే నంటుంది. మరి యీ తేడా! ఆమె యీ మనస్తత్వం వెనుక కారణాలు ఊహించటానికీ, వాటిని ఎత్తిచూపుతూ ఆమెతో వాదనకు దిగటానికీ రామకృష్ణకు మనసొప్పలేదు.

కారణాలు తెలియచెప్పితేనే అవలీలగా బుద్ధులు మారవు, వాదనలు చేస్తూనే దృక్పథాలు ఉన్నట్టుండి విశాలం కావు -అవి సంస్కారంలో భాగం కానంతవరకూ యీ ఏడుపులే. బావ మరిదికీ, మరదలుకూ చెరి రెండువందలయాభై చేసే వస్తువు లేవైనా చదివింపులుగా తీసుకువెళితే బాగుంటుందనుకున్నాడు, తాను. గౌరి యీ ఆర్థిక సూత్రం తలక్రిందులు చేసింది- ప్రేమల పంపకంలో.

రామకృష్ణ ఉద్దేశాన్ని బంగారు అంగడివాడు మరింత తలకిందులు చేశాడు. ఉంగరం మూడు వందల యాభై పై చిల్లర అయింది. వందా ఇరవైకంటే ఖరీదైన చీరను మరదలు సుమతికి రామకృష్ణ తేలేకపోయాడు.

ఉంగరం చూసి "ఇది వాడి వేలుకు పడుతుందో లేదో" నని గౌరి గునిసింది. 'మరదలుకు మంచి చీరే తెచ్చారే' అని ఎగతాళి చేసింది. రామకృష్ణ నవ్వి ఊరుకున్నాడు.

'గట్టి వరహాని బంగారు ఉంగరం' బావమరిదికీ, 'గట్టి వరహాని పీతాంబరం' మరదలుకూ రామకృష్ణ చదివించాడు. పురోహితుడి చదివింపుల అరుపులు నలుగురికీ వినిపించాయో లేదోనని గౌరి పెళ్ళి పందిట్లోనలువైపులా చూసింది. గర్వంగా. చదివించిన ఉంగరాన్ని, ఉంగరం వేలుకు పెట్టుకుంటూ, కాబోతున్న భార్యను చూసి ముసిముసి నవ్వులు బావమరిది నవ్వాడు. చీరె పాకెట్ విప్పి తనవైపు చూసి మరదలు కళ్లుదించుకుంది. రామకృష్ణ తానేదో తప్పుచేసినట్లు కుంచించుకుపోయాడు.

వచ్చిన తంతు ముగిసింది. రామకృష్ణ సెలవులేదని వెంటనే బయలుదేరి జమ్మలమడుగు చేరుకున్నాడు - గౌరి మరో వారంరోజులు ఎలాగూ అక్కడే ఉంటుంది కదా అని.

అయిదోరోజు కాలేజీనుంచీ తిరిగివస్తూనే, ఇంట్లో పడకేసి వున్న గౌరిని చూసి రామకృష్ణ ఆనందపడ్డాడు. సరదాగా అడిగాడు :

"మీ తమ్ముని మామగారి ఊరు కూడా వెళ్ళి వచ్చావా? వాళ్ళకార్లలో జోరుగా తిరిగావా? నీ మరదలు ఏమంటోంది? ఆ పెద్ద సంబంధం ప్రపంచంలో పడి యిప్పుడిప్పుడే రావనుకున్నానే. అనంతపురం పోలేదా? ఇంతకూ నలుగుర్లో ఏపాటి గౌరవం మూటగట్టుకొని వచ్చావు?"

హఠాత్తుగా గౌరి బెక్కింది.

"ఏమైంది?" రామకృష్ణ ప్రేమగా అడిగాడు.

"నా ఖర్మ ! అందరికీ లోకువే ఆడదంటే."

"ఏదో సరదాగా అడిగాను. నిన్న బాధపెట్టడం నా ఉద్దేశ్యం కాదు." పక్కన కూర్చొని ముఖంమీద పడ్డ తలవెంట్రుకల్ని పైకి చేత్తో దువ్వుతూ అన్నాడు.

"మీరు కాదు వాడే. తమ్ముడు కదా అని ప్రేమ చూపితే నిన్నగాక మొన్న పెళ్ళి అయిందో లేదో అప్పుడే తోబుట్టువులు చులకనైపోయారు."

. "ఏదైనా గొడవ జరిగిందా? తొందరపడి ఏమైనా అన్నాడా?"

"ఏమంటాడు? అంటే ఆడబిడ్డ ఉసురు ఊరికేపోదు. అబ్బని మించిన కొడుకు ! నెక్లెసూ, కమ్మలు చేయించమన్నా. అంతే. వెనకా ముందూ ఎవరున్నారని - నేనూ సుమతీ తప్పు? ఆ ఆస్తి అంతా కట్టుకొని ఊరేగుతాడా? మా నాన్నే నయం. చేయించమన్నాడు. 'పెళ్ళి ఖర్చులు తడిపి మోపెడైనాయి. చేయించవచ్చులే' అన్నాడు. పెట్టుచీరలైనా రెండో, మూడో పెట్టమని మా అమ్మఅంటే 'ఎందుకూ దండగ, ఆ ట్రంకుల్లో చెలుము పట్టడానికి' అంటూ నాసిరకంవి ఏవో తెచ్చి మొహాన కొట్టారు. మన మేమీ గతిలేక అక్కడికి పోలేదు".

"అంత ప్రేమగా ఉంగరం చదివించావు కదా!"

"ఆ ప్రేమ కారిపోయి కాదు - మిమ్మల్ని యిబ్బంది పెట్టింది. ఇంటికి పెత్తందారు కాబోతున్నాడు కదా - ఏదో తోబుట్టువుల్ని యింత జ్ఞాపకం పెట్టుకుంటాడని, ముందు ముందు నగో, నట్రో చేయిస్తాడని, చీరో సారో పెడతాడని. ఆస్తిపాస్తుల్లో భాగ మడిగినట్లు తన్నుకొని చస్తారు - ఆడపిల్లలకు ఏమీ పెట్టాలన్నా. యింత డబ్బు కాపీనం వుంటే పుట్టిల్లు మరిచిపోవాల్సిందే." గౌరి తమ్ముని దండకం చదివింది.

"డబ్బు ఆశలేని దెవరికిలే - ఎక్కువ తక్కువా అంతే. ఏ బంధాలు లేవు" రామకృష్ణ అర్థవంతంగా అన్నాడు.

"మరీ అంతనా? వీడిని నమ్ముకొని ఆ సుమతిని బాధపెట్టినా, అది నన్ను పట్టుకొని ఒకటే ఏడ్చింది - కనీసం చెప్పిన బంగారమయినా తనకు పెట్టలేదని".

రామకృష్ణకు విషయం తెలిసింది.

మగవాళ్ళకంటే హీనంగా ఎందరి దయాదాక్షిణ్యాల మీద యీ ఆడవాళ్లు బతకాలి, ఎంత వంచనా శిల్పాన్ని అలవరచుకోవాలి.

జాలి చూపాలా? తనకు అర్థంకాదు. రామకృష్ణ గౌరి పాఠం గౌరికి నిర్వికారంగా అప్పజెప్పాడు:

"అయినా ఆడపిల్లలకే పెడుతూ కూర్చుంటే కన్నకొడుకులు చిప్పలు పట్టుకొని వీధిలో పడాల్సిందే. కొడుకులు కొడుకులే. కూతుర్లు కూతుర్లే అని నువ్వే అన్నావుగా, అలాగే తమ్ముళ్ళు తమ్ముళ్లే, చెల్లెళ్ళు చెల్లెళ్ళే, డబ్బు ఆశ డబ్బు ఆశే అనుకోరాదా? సరిపోతుంది. లే... లే."

రామకృష్ణ దెప్పిపొడుస్తున్నాడని గౌరికి దుఃఖం మరింత పెల్లుబికింది. ○

● సెప్టెంబర్ 1977, యువ మాసపత్రిక. ●